ప్రజాశక్తి
శుక్రవారం 19 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు

నైట్ సర్వీసు బస్సుల పునరుద్ధరణ

ప్రజాశక్తి -సీలేరు

విశాఖ నుండి నర్సీపట్నం, సీలేరు మీదగా భద్రాచలం వెళ్లే ఆర్టీసీ నైట్ సర్వీసు బస్సును గురువారం రాత్రి నుంచి పునరుద్ధరించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. చతీష్ఘడ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొద్ది రోజుల క్రితం జరిగిన ఎన్కౌంటర్లో సుమారు 20 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోయిస్టులు ఈ నెల 11 నుంచి 16 వరకు నిరసన దినాలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై ప్రభుత్వ ఆస్తులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పోలీసుల ఆదేశాల మేరకు నైట్ బస్సు సర్వీసులను ఈ నెల 11 నుండి 17వ తేదీ వరకు రద్దు చేశారు. మావోయిస్టుల నిరసన దినాలు ముగియడంతో 18వ తేదీ రాత్రి నుంచి యధాతథంగా నైట్ సర్వీసులను అధికారులు పునరుద్ధరించారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

▶▶ ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

▶▶ 30 పోలింగ్ కేంద్రాల పేర్లు, స్థానాలు మార్పు ▶▶ జిల్లా కలెక్టర్ విజయ్ సునీత

మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత

ప్రజాశక్తి-పాడేరు-: రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు సుమారు 28,800 అధికంగా ఉన్నారని, మహిళలందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేసారు. ఎన్నికలలో ప్రతి ఓటరూ ఓటు హక్కు వినియోగించు కోనేందుకు చర్యలు తీసుకున్నందున ఓటర్లందరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికలలో సుమారు 61 వేల మంది అధిక ఓటర్లు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా గత జనవరి 22న తుది జాబితా ప్రకటించిన తరువాత సుమారు ఎనిమిది వేల ఓటర్లను ఫారం -6 ద్వారా నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 14 వరకు అందిన ఫారం -6 లను పరిశీలించి అప్ డేట్ చేశామన్నారు. జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఓటింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమె జరపడానికి ఎన్నికల కమిషన్ సూచించిందని చెప్పారు. ఎన్నికల సంఘం అనుమతితో జిల్లాలో 30 పోలింగ్ కేంద్రాల పేరు, లొకేషన్ మార్పు చేశాన్నారు. వై.రామవరం మండలంలో ఆరు పోలింగ్ కేంద్రాల నుండి పోలింగ్ అనంతరం మెటీరియల్ను హెలికాప్టర్లో తరలించేందుకు చర్యలు తీసుకున్నా మన్నారు. సుమారు 2,689 మంది పిఒ, ఎపిఒలకు, శిక్షణ ఇచ్చామని, 5,116 ఒపిఒలకు శిక్షణ ఇస్తామని, అనివార్య కారణాలతో హాజరు కానివారికి ఆన్లైన్ శిక్షణ ఇస్తామని స్పష్టం చేసారు. జిల్లాకు ముగ్గురు పరిశీలకులను నియమించారని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, సువిధ యాప్తో నామినేషన్ దాఖలు చేసుకోవచ్చని, దానిని డౌన్ లోడ్ చేసి ఫిజికల్ ప్రతి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని స్పష్టం చేసారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉల్లంఘనలతో నలుగురు వాలంటీర్లను, ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని విధులనుండి తొలగించడం జరిగిందన్నారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ, మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గత రెండు నెలల నుండి విస్తత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేసామని, తొమ్మిది ఎస్ఎస్టి, 17 ఎఫ్.ఎస్.టి బృందాలు ఏర్పాటు చేసామని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఉన్న కంట్రోల్ రూమ్లతో పాటు సబ్ డివిజన్ స్థాయిలో నాలుగు, జిల్లా స్థాయిలో ఒకటి కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా చేపడుతున్నట్లు తెలిపారు.



రిటర్నింగ్ అధికారి ప్రశాంత్కుమార్కు నామినేషన్ అందిస్తున్న లక్ష్మీప్రసన్న

తొలి రోజు రెండు నామినేషన్లు

ప్రజాశక్తి- రంపచోడవరం

రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి మొదటి రోజు రెండు నామినేషన్లు వచ్చినట్లు ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు ఒక్కొక్క నామినేషన్ పత్రం దాఖలు చేసినట్లు వెల్లడించారు. రంపచోడవరం మండలం సిరిగిందలపాడు గ్రామానికి చెందిన హైకోర్టు అడ్వకేట్ పాలడుగు లక్ష్మీ ప్రసన్న, ఇదే గ్రామానికి చెందిన పాలడుగు వెంకటేశ్వరరావు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్ధంగా సేవలు చేయాలని ఉద్దేశంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.జ్యోతికృష్ణ, తహశీల్దారు నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్లు యన్వివి సత్యనారాయణ, శివ, రామకృష్ణ, చైతన్య, విశ్వనాథం, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్రరావు, సీనియర్ అసిస్టెంట్లు లక్ష్మణరావు, పాలు బాబు పాల్గొన్నారు.

అరకు నియోజకవర్గానికి నిల్

పాడేరు : మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సాదారణ ఎన్నికలకు 18వ తేదీన నోటిఫికేషన్ విడదలయ్యిందని చెప్పారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి ఐటిడిఏ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేస్తూ అరకు అసెంబ్లీ నియోజక వర్గం నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థితో పాటు నలుగురిని (1ప్లస్ 4) రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తామని చెప్పారు. దరావత్తు చెల్లించి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు సమయపాలన పాటించాలని చెప్పారు.

నేడు సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స నామినేషన్

వంద శాతం ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేస్తానని వెల్లడి

ప్రజాశక్తి -పాడేరు: ఇండియా కూటమి బలపరిచిన అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనరస ఈనెల 19న శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ఇండియా కూటమి పక్షాలు, సిపిఎం శ్రేణులతో నిర్వహించే ర్యాలీతో కలిసి వెళ్లి ఆయన తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసి ప్రజలకు అండగా సిపిఎం, ఆదివాసి గిరిజన సంఘం అనేక ఉద్యమాలు చేసిందన్నారు. నిరంతరం గిరిజనులకు అండగా నిలిచే సిపిఎం తరపున పోటీ చేస్తున్న తనను ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. గిరిజన చట్టాలను సక్రమంగా అమలు చేయకుండా హక్కులను కాలరాస్తూ పాలకపక్షాలు అనాదిగా ఆదివాసీలకు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు గత ఐదేళ్ల పాలనలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేశాయని దుయ్యబట్టారు. గిరిజనుల మనుగడకు తూట్లు పొడుస్తున్న పాలకపక్షాలను గద్దె దించాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. ప్రత్యక్ష పోరాటాలతో నిరంతరం ప్రజలకు అండగా ఉంటున్న ఇండియా కూటమి అభ్యర్థులను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

వంద శాతం ఉద్యోగ అవకాశాలకు కృషి

అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతంలో వంద శాతం ఉద్యోగ అవకాశాలు కోసం కృషి చేస్తానని అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స తెలిపారు. గురువారం అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రాజ్యాంగం రద్దు చేస్తే మొట్టమొదట నష్టపోయేది అదివాసీలేనని తెలిపారు. జిఓ 3 రద్దుతో గిరిజన యువతీ యువకులకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఎం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. బిజెపి ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టం రద్దు చేయడంతో తీవ్ర నష్టం జరిగిందన్నారు. వైసిపి, టిడిపిలను ఓడించి నిరంతరం ప్రజా సమస్యలపై గిరిజన హక్కుల కోసం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.

నామినేషన్లకు ముహూర్తం ఖరారు

ఎన్నికల్లో అభ్యర్థులు సెంటిమెంట్లకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. ఈ మేరకు ఎన్నికల బరిలో నిలిచేందుకు తొలి ప్రక్రియ నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థులంతా ముహూర్తాలు చేసుకుని సిద్ధమయ్యారు. అల్లూరి జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు మంచి రోజు కోసం పురోహితుల్ని సంప్రదించి ఈనెల 19, 22, 25, తేదీల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు ముహూర్తం చేసుకున్నారు. ఈ మేరకు పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి వైయస్సార్సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కిల్లు వెంకట రమేష్ నాయుడు అరకు అసెంబ్లీ బిజెపి అభ్యర్థి ఈ నెల 19న శుక్రవారం నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ నియోజకవర్గంలో టిడిపి రెబల్ అభ్యర్థిగా బరిలో దిగుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అరకు వైసిపి అభ్యర్థి రేగం మత్స్య లింగం అరకు లోక్సభ బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీత ఈనెల 22న సోమవారం నామినేషన్ వేయనున్నారు ఈ నెల 24న బుధవారం అరకు లోక్ సభ వైసిపి అభ్యర్థి గుమ్మ తనుజరాణి నామినేషన్ వేస్తారు కాంగ్రెస్ అభ్యర్థి శతక బుల్లిబాబు ఈనెల 25న గురువారం నామినేషన్ వేయనున్నారు.

మాట్లాడుతున్న జెడ్పిటిసి సభ్యులు ఒడుగుల జ్యోతి

వైసిపికి జెడ్పిటిసి జ్యోతి రాజీనామా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వైసిపి నాయకులు తమను పట్టించుకోవడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపిస్తూ జెడ్పిటిసి సభ్యురాలు ఒడుగుల జ్యోతి గురువారం వైసిపికి రాజీనామా వేశారు. ఈ మేరకు గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో జ్యోతి మాట్లాడుతూ పార్టీలో సమన్వయ లోపం ఉందని, జెడ్పిటిసి అయిన తనను కూడా పార్టీ నాయకులు గౌరవించకుండా చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి మండల నాయకుల తీరు మారకపోవడం వలన తాము పార్టీలో ఇమడలేక వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తదుపరి ఏ పార్టీలో చేరేది రెండు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు చీడిపల్లి అప్పారావు, యువజన నాయకులు అంకం రవి పాల్గొన్నారు.

అక్రమంగా చేపడుతున్న కట్టడం

జోరుగా అక్రమ నిర్మాణాలు

-పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-హుకుంపేట: సందడిలో సడే మియా అన్నట్టు ఎన్నికల వేళ ఎవరు పట్టించు కోరని భావించిన గిరిజనులు మండల కేంద్రంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. మండల కేంద్రంలో జోరుగా పలు అక్రమ కట్టడాలు కడుతున్నారు. మండల కేంద్రంలో ఓ గిరిజనేతరుడు కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకుని, రెండంతస్తుల శ్లాబును శ్రీరామనవని బుధవారం సెలవు కావడంతో నిర్మించుకున్నాడు. గిరిజనులు చిన్న దుకాణం వేస్తే ఆగమేగాలపై తొలగించే రెవిన్యూ అధికారులు మండల కేంద్రంలో అక్రమ కట్టడాలు కనబడలేదా అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారుల ఆదేశాల నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు ప్రజా సంఘాలు నేతలు ఆరోపించారు. మండల కేంద్రంలో జోరందుకున్న అక్రమ కట్టడాల నిలుపుదలకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని ప్రజాసంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ కట్టడాలు నిలుపుదల చేసి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పలువురు గిరిజనులు కోరుతున్నారు.

85 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని 24 పంచాయతీల్లో పని చేస్తున్న వాలంటీర్లు రాజీనామాలు సమర్పించారు. 255 మంది వాలంటీర్లు ఉండగా గురువారం 85 మంది వాలంటీర్లు రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమర్పిం చినట్లు ఇన్చార్జి ఎంపీడీవో నగేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బెదిరింపులతోనే రాజీనామా :సిపిఎం

అనంతగిరి: మండలంలో పని చేస్తున్న 255 మంది వాలంటీర్లు వైసిపి నేతల బెదిరింపులతోనే ముకుమాడిగా రాజీనామా చేశారని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వాలంటీర్లు రాజీనామా చేసి అధికార పార్టీ తరపున పోటీ చేస్తున్న అరకు పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించాలని అధికారి పార్టీ తరపున నియమించిన ఎంఎల్ఓ సత్యనారాయణ ఒత్తిడి తెస్తున్నారన్నారు. దీంతో వాలంటీర్లు ఏమి చేయాలో తెలియక మనస్థాపానికి గురై మనోవేదనతో రాజీనామా చేస్తున్నారన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతానికి అన్యాయం చేసిన

బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడించండి

సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకుల పిలుపు

సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కూనవరం

ఏజెన్సీ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి, తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి పాయం సీతారామయ్య అధ్యక్షతన మూడు పార్టీల నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శ్రీమంతుల వెంకటరమణ, సిపిఐ నాయకులు మండా దుర్గా ప్రసాద్, సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల నష్టపోయిన నిర్వాసితులను నట్టేట ముంచి, ఇప్పుడు కొత్తగా మోసపూరిత హామీలు ఇస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు, ముఖ్యమంత్రి జగన్ మాటలను నమ్మొద్దని హితవుపలికారు. పోలవరం నిర్వాసిత మండలాలకు బిజెపి, టిడిపి, వైసిపి చేసింది ఏమీ లేదని, ఆ మూడు పార్టీలకు ఓట్లు అడిగే కనీస అర్హత లేదని పేర్కొన్నారు. ఇండియా వేదిక మద్దతు ఇస్తున్న సిపిఎం రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి లోతా రామారావును, అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు గుజ్జా మోహనరావు, లంబు శ్రీనివాసరావు, మామిళ్ళ రామారావు, బాషా, మేకల నాగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు,టి.నాగరాజు, శ్యామల కృష్ణ పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి : మంతెన సీతారాం

కూనవరం : సిపిఎం అభ్యర్థులను గెలిపించడానికి ప్రతి కార్యకర్తా సైనికుల్లా పని చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో తలకాని నాగరాజు అధ్యక్షతన గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీతారాం మాట్లాడారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడిన సిపిఎం అభ్యర్థులకు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సర్పంచ్ నాగమణి, బొగ్గా వెంకమ్మ, శ్యామల కృష్ణ, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపిద్దాం

రాజవొమ్మంగి : ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు లోతా రామారావు, పాచిపెంట అప్పలనర్సలను గెలిపించుకుని, ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మండల కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎస్కెఎం.మహబూబ్ అలీ మాట్లాడుతూ ఏజెన్సీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో లోతా రామారావు వంటి నాయకుడ్ని గెలిపించుకోవడం ఎంతో అవసరమన్నారు. కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి సవరపు సతీష్ మాట్లాడుతూ ట్రైబ్, నాన్ ట్రైబ్ అనే తేడా లేకుండా ఏజెన్సీలో అందరూ ఇబ్బందులు పడుతున్నారని, లోతా రామారావు గెలిస్తే సమస్యలు పరిష్కరానికి చక్కని అవకాశం ఉంటుందని చెప్పారు. సిపిఎం మండల నాయకులు కోండ్ల సూరిబాబు, సింగిరెడ్డి అచ్చారావు మాట్లాడుతూ ఏజెన్సీ సమగ్రాభివృద్ధికి, నీతి నిజాయితీగా పనిచేసే సిపిఎం అభ్యర్థులకు 'సుత్తి కొడవలి నక్షత్రం' గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

ప్రచారంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర నేత ఎవి.నాగేశ్వరరావు, కాంగ్రెస్ నేతలు

జోరుగా సిపిఎం ప్రచారం

అడ్డతీగల : రంపచోడవరం అసెంబ్లీ, అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థులు లోతా రామారావు, పాచిపెంట అప్పలనర్సలకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిపిఎం, కాంగ్రెస్ నాయకులు గురువారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సిపిఎం అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దంగేటి సత్తిబాబు, సిపిఎం రాష్ట్ర నాయకులు ఏవి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు ఎం రాజశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడేరు : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అరకు లోక్ సభ అభ్యర్థి అప్పలనరస ని గెలిపించాలని కోరుతూ గురువారం పాడేరు మండలం వణుగుపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లింగేరి సుందరరావు మాట్లాడుతూ, గిరిజన చట్టాలు, హక్కులు, జిఓ 3 పునరుద్ధరణ తదితర సమస్యలపై నిరంతరం పోరాడేదీ సిపిఎం మాత్రమే అన్నారు.రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా మోసం చేసిన బిజెపి పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రసాద్, కొండబాబు, రమేష్, అప్పన్న, పాల్గొన్నారు.

పాడేరు మండలం వణుగుపల్లిలో నినాదాలు చేస్తున్న స్థానికులు, సిపిఎం నేతలు

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

ఎవిఎస్ విఎస్ఆర్ వర్ధంతి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విఆర్.పురం

ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కీర్తిశేషులు ఏవీఎస్ విఎస్ఆర్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈనెల 21న చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగు ఈ వర్ధంతి కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ వర్ధంతి సభకు ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి రామారావు, సత్యనారాయణ, యన్ రామకృష్ణ, యం బాబు, యస్ అజయ్, టి రాము, యన్ ప్రసాద్, బి సీతారామరాజు, పి గురు సాయి నవీన్, జె వెంకటరెడ్డి, కె రమేష్ బాబు, పి వెంకటరెడ్డి, యం సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తులు తీసుకునే విధంగా సబ్ కలెక్టర్ కార్యాలయ ముఖదూరం దగ్గర హెల్ప్ డెస్క్ను డిప్యూటీ తహశీల్దారు వీరభద్రరావు, సీనియర్ అసిస్టెంట్లు పాలు బాబు, అలెగ్జాండర్ ముగ్గురితో ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్ నుండి అభ్యర్థులు దరఖాస్తు తీసుకోవచ్చని చెప్పారు.

దరఖాస్తు అందుకుంటున్న పోటీ చేసే అభ్యర్థి సీతారత్నం

ఉపాధి హామీ బోర్డులో.. పనుల వివరాలు ఏవీ?

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగిన పనులకు సంబంధించి కురిడి పంచాయతీ గదబ గల్లుంగు, బలియాగూడ, నిమ్మగడ్డ గ్రామాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే వివరాలు రాయకుండా వదిలేశారు. జరిగిన పనులకు సంబంధించి ఎంత మంది ఉపాధి కూలీలు పనిచేశారు. ఎంత నిధులు కేటాయించారనే వివరాలను నేమ్ బోర్డులో తెలపాల్సి ఉంటుంది. ఈ నేమ్ బోర్డు ఏర్పాటు చేసి సుమారు రెండు, మూడు నెలలు గడుస్తున్నా వివరాలు రాయకుండా వదిలేయడం విశేషం.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి-పాడేరు: అనంతగిరి మండలం డెక్కపురం గ్రామానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు ఏపీ ఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవిఎన్ ఎం అప్పారావు గురువారం ఒక ప్రకటనలో ప్రజాశక్తికి తెలిపారు. ఈ గ్రామంలో ఈ నెల 14న ఉరుములు ఈదురు కాలులతో కూడిన వర్షం పడటంతో జంపర్ తెగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. ఈ గ్రామం కొండ ఎగువన ఉండటంతో అదే రోజు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేక పోయామని మరుసటి రోజు 15న తమ సిబ్బంది సుమారు 7 కిలోమీటర్లు నడిచి ఆ గ్రామానికి వెళ్లి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేసినట్లు వెల్లడించారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

ప్రజాశక్తి -నక్కపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే గీతాంజలి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం లో గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసారు. ఈ మేరకు నోటీసు బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ ప్రదర్శించారు. 18వ తేదీ నుండి ఏప్రిల్ 25వ చేసి వరకు పని దినాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం తొలి రోజు నాడు నామినేషన్లు దాఖలు కాలేదని ఆర్ఓ గీతాంజలి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ శ్రీకాంత్, డి.ఎస్.పి అప్పారావు, సిఐ విజయ్ కుమార్, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, ఎలక్షన్ డిటి చైనులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నాణ్యతపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి: వృత్తి విద్యతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు త్వరితగతిన లభిస్తాయని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామప్రతాప్‌రావు, వృత్తి విద్యా ఉపాధ్యాయులు పి.విష్ణు తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా కంప్యూటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు వృత్తి విద్య పై అవగాహన కల్పించారు. వృత్తి విద్యతో కలిగే ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వివరించారు. డొంకాడ గ్రామంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ బి.రజిత విద్యార్థులకు మట్టి నాణ్యత, విత్తనాలు నాణ్యత, మొక్క పెరుగుదల, రసాయనిక ఎరువులు, చీడపురుగులు నిర్మూలన, ఆధునిక పద్ధతిలో వ్యవసాయంపై 12 రోజులు శిక్షణ ఇచ్చారు.

'జైభీమ్ రావ్ భారత్' అసెంబ్లీ అభ్యర్థిగా నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నంలో సీనియర్ దళిత నాయకుడిగా గుర్తింపు పొందిన నేతల నాగేశ్వరరావు గురువారం ఉదయం జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జేబిపి)లో చేరారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్ విజయవాడలో పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. నర్సీపట్నం అసెంబ్లీ బరిలో పార్టీ తరపున నిలబడేందుకు భీ-ఫారంను కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా నేతల నాగేశ్వరరావు మాట్లాడుతూ,రాజ్యాంగమే ప్రామాణికంగా పార్టీ మ్యానిఫెస్టోను నర్సీపట్నం నియోజకవర్గ ప్రజల్లోకి తీసుకు వెళతానన్నారు.

రోడ్డు సౌకర్యం లేక అవస్థలు

రేషన్ సరుకులు మోసుకుంటూ కాలినడకన రాకపోకలు

ప్రజాశక్తి-అనంతగిరి: ఏళ్ళు గడుస్తున్నా గిరిజన పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నాయి. కనీసం సరైన రోడ్డు మార్గాలు లేక మారుమూల గిరిజన పల్లెల గిరి పుత్రులు ఎత్తైన కొండల మధ్య కిలోమీటర్ల దూరం కాలిబాటన సరుకులు నెత్తిపై మోసి గ్రామాలకు తీసుకొస్తున్నారు. లొంపలి పంచాయతీ చిన్నకోనెల, బూరిగ గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేక పోవడంతో ఆయా గ్రామాల గిరిజన ప్రజలు విజయనగరం జిల్లా లోతుగెడ్డ పంచాయతీ సారడవలస గ్రామంలో రేషన్ బియ్యం విడిపించుకుని తిరిగి సుమారు 8 కిలోమీటర్లు కొండ కోన నడుము నుండి తమ గ్రామాలకు కాలినడకాన మోసికొని వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.ఎన్ఆర్.పురం పంచాయతీ పెద్దూరు, బొడ్డవలస మీదుగా బూరిగ, చిన్నకోనెల గ్రామాలకు మిషన్ కనెక్టివిటీ పాడేరు కింద నిధులు నాలుగు కోట్లు మంజూరు చేశారు. తూతూ మాత్రంగా రోడ్డు పనులు చేపట్టి వదిలేసారని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పదవ వార్డ్ మెంబర్ సోమ్మెల అప్పలరాజు, గ్రామస్తులు బి.సన్యాసిరావు, కె సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు.

రేషన్ సరుకులు మోసుకుని మెలుతున్న మహిళలు

నక్కపల్లి మండలంలో అనిత ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినతీనార్ల, దొండవాక గ్రామాల్లో గురువారం కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఉపాధి కూలీలతో కలిసి పని చేశారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కురుందాసు నూకరాజు, మెరుగు నాగేశ్వరరావు, తాతారావు, గింజాల లక్ష్మణరావు, జనసేన నాయకులు బోడపాటి శివదత్ పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలోని జగ్గంపేట అన్నవరం గ్రామాల్లో కూటమి పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో జగంపేట గ్రామానికి శాశ్వత రహదారి ఏర్పాటు చేశానని ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జానకి శ్రీను, నాయకులు జనార్ధన్, తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, బికేపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, సత్యంబాబు, బాబ్జి పాల్గొన్నారు.

మాడుగులలో బండారు సత్యనారాయణ పర్యటన

ప్రజాశక్తి - మాడుగుల : మాడుగుల నియోజకవర్గ ఉమ్మడి పార్టీ అభ్యర్థి మార్పు జరిగే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గురువారం అకస్మాత్తుగా బండారు సత్యనారాయణ మూర్తి, గవిరెడ్డి రామానాయుడు, పివిజి కుమార్‌లతో కలిపి మాడుగుల మోదమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మాడుగులలో పర్యటించానని, ఈ నియోజకవర్గంలో ఎంతో అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో తాను చదువుకున్నానని, ఇక్కడ ఎందరో స్నేహితులు, బంధువులు ఉన్నారన్నారు. ఇన్నేళ్ల తన అనుభవంతో మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సుమారు వెయ్యి మంది కార్యకర్తలతో మాడుగుల మండలం ముకుందపురం గ్రామం నుండి ఘాట్ రోడ్ జంక్షన్ మీదుగా మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీని నిర్వహించారు. త్వరలోనే అధికారికంగా సమావేశం ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సురేష్ నాయుడు, చోడవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బత్తుల తాతయ్యబాబు, మోదకొండమ్మ ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనుండాలి

ప్రజాశక్తి- కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల వాసులు కేన్సర్ లక్షణాలను ముందుగా గుర్తించాలని హోమి బాబా కేన్సర్ ఆసుపత్రి వైద్యులు తరుణ్ ప్రసాద్, మన్స్ చంద్వాణి సూచించారు. కొడవటిపూడి ప్రాథమిక వైద్య కేంద్రంలో గురువారం పరిసర ప్రాంత వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రొమ్ము, గర్భాశయ, నోటి, క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి లక్షణాలు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల కొడవటిపూడి వైద్య సిబ్బందికి హోమి బాబా (అగనంపూడి) కేన్సర్ ఆసుపత్రిలో లక్షణాలు గుర్తించడంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సిబ్బంది అనుమానితులను గుర్తించి ప్రాథమికంగా స్క్రీనింగ్ టెస్ట్ లో నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందితో పరీక్షలు నిర్వహించు కోవాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యులు సంతోష్ కుమార్, ఎంపిహెచ్ఓ గోవిందరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆగివున్న లారీని ఢీకొని డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అనకాపల్లి-ఆనందపురం 16వ నెంబర్ జాతీయ రహదారిలో ఇరువాడ సమీపంలోని పార్కింగ్ స్థలంలో ఆగివున్న లారీని బుధవారం రాత్రి మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం చెందారు. పోలీసులు కథనం ప్రకారం... కాకినాడ రూరల్ ఇందిరపాలెం గ్రామానికి చెందిన మసుమెను శ్రీనివాసరావు (44) కాకినాడ నుండి భువనేశ్వర్ పామాయిల్ లోడుతో వెళ్తున్నాడు. ఇరువాడ దరి పార్కింగ్ స్థలంలో సిగ్నల్ లైట్స్‌గాని ,సేఫ్టీ ఇండికేటర్స్ గాని లేకుండా ఆగి ఉన్న లారీని వెనుక నుండి శ్రీనివాసరావు లారీ ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు లారీ కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే శ్రీనివాసరావును బయటకు తీసి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ చెప్పారు.

మద్యం, నాటుసారా అమ్ముతున్న వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని గున్నెంపూడి, కేపీ అగ్రహారం, తురకలపూడి, చిన్నప్పన్నపాలెం, పెద్దమదిన, కోమల్లపూడి తదితర గ్రామాల్లో అక్రమంగా మద్యం, నాటు సారా అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో సిఐ అప్పలనాయుడు, సర్కిల పరిధిలో పలువురు ఎస్ఐలు పాల్గొన్నట్లు వెల్లడించారు.

కూలీలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఏపీవో గంగునాయుడు కోటవురట్ల చెరువులో పనిచేస్తున్న కూలీలను కలిసి వేసవి జాగ్రత్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం 5 గంటల నుండి పనులు ప్రారంభించాలని, సాయంత్రం సమయంలో కూడా పనులు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, సుమారు 1024 గ్రూపులకు 820 వరకు గ్రూపులు పని చేస్తున్నాయన్నారు. మండల వ్యాప్తంగా 8,400 మంది కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నారని తెలిపారు. వీరికి రోజుకి సగటున రూ.290 వరకు వేతనాలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఐదు కిలోమీటర్లు దాటి ప్రయాణించిన కూలీలకు రూ.35 ప్రయాణ చార్జీలు అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట విఆర్‌పి అనిత ఉన్నారు.

వేతనాలు చెల్లించరూ..

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల మిడ్ డే మీల్స్ నిర్వాహకులకు గడిచిన 8 నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ప్రజాశక్తి విలేకరి వద్ద తమ గోడును వెలదీసుకున్నారు. ప్రతి నెల రూ.3 వేలు ఇచ్చే వేతనం అందక పోవడంతో అప్పులు చేసుకోవలసిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారులకు తెలిపినా చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి తక్షణమే వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

టిడిపి హయాంలో డ్వాక్రా రుణమాఫీ ఏదీ?

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: అయ్యన్న, విజయ్‌లను నమ్ముకుంటే నర్సీపట్నం నాశనమేనని నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 27వ వార్డులో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళా మేలుకో పేరుతో టీడీపీ నాయకులు మహిళల కోసం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అప్పట్లో ఎంత మందికి మాఫీ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. 2014లో మహిళలకు సెల్ ఫోన్లు ఇస్తామని చెప్పారని నర్సీపట్నం నియోజకవర్గంలో ఎంత మందికి ఇచ్చారో అయ్యన్నపాత్రుడు చెప్పాలన్నారు. ఆడ బిడ్డ పుడితే 30వేలు ఇస్తామని చెప్పారని, ఇంత మందికి ఇచ్చారో చెప్పాలన్నారు. కాబట్టే మహిళలు మేల్కొని 2019 ఎన్నికల్లో మిమ్మల్ని తొక్కారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు ఇన్‌చార్జ్ కొణతాల అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిగిలిన రేషన్ సరుకుల పంపిణీ

ప్రజాశక్తి కథనానికి స్పందన

రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండియు ఆపరేటర్

ప్రజాశక్తి -సీలేరు : 'జిసిసి సేల్స్‌మ్యాన్ నిర్లక్ష్యంతో అందని రేషన్ సరుకులు' శీర్షికన బుధవారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి జిసిసి అధికారులు స్పందించారు. మిగిలి ఉన్న సరుకులు ఎండియు ఆపరేటర్‌కు సరఫరా చేయడంతో గురువారం కార్డుదారులకు సరుకులను పంపిణీ చేశారు. జీకే వీధి మండలం సీలేరుకు ఈనెల అలాట్మెంట్ ప్రకారం 260 బస్తాలు రేషన్ బియ్యం ఎండియు ఆపరేటర్‌కి ఇవ్వాల్సి ఉండగా, జిసిసి సేల్స్‌మ్యాన్ శ్రీనివాస్ 230 బస్తాలు మాత్రమే ఇచ్చారు. రేషన్ సరుకులు లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన చివరి తేదీ వచ్చినా జిసిసి సేల్స్‌మ్యాన్ సరుకులు ఇవ్వకపోవడంతో ఎండియు ఆపరేటర్ ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు సర్పంచ్‌కు దుర్జోకు తెలియజేయగా, ఆయన ప్రజాశక్తి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యపై బుధవారం ప్రజాశక్తి కథనం ప్రచురించడంతో జిసిసి అధికారులు స్పందించి ఇవ్వాల్సిన బ్యాలెన్స్ రేషన్ సరుకులు ఈ నెల 17న అందజేశారు. దీంతో ఎండియు ఆపరేటర్ గురువారం రేషన్ సరుకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం మెరైన్ బిపిసిఎల్ పెట్రోల్ బంక్ వద్ద వినియోగదారులు, బంక్ సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక దళ వారోత్సవాల్లో భాగంగా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బంక్ యాజమాన్యం మాట్లాడుతూ, తరచూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా అగ్ని ప్రమాదాలకు ఆస్కారముండదన్నారు. ఫైర్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెయిందోర పేట, పెద్ద జాలరి పేటల్లో వాల్‌పోస్టర్లు అతికించి, ప్రజలకు కరపత్రాలను పంచుతూ అగ్నిప్రమాదాల నివారణపై వివరించినట్లు ఎడిఎఫ్ఓ పి.సింహాచలం తెలిపారు.

తుమ్మలలో తాగునీటికి కటకట

- 50 రోజుల క్రితం మరమ్మతులకు గురైన మంచినీటి పథకం మోటారు
- పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని తుమ్మల పంచాయితీ కేంద్రం తుమ్మల గ్రామంలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామంలోని వాటర్ ట్యాంకు మోటారు 50 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి పథకం నుండి నీరు రాకపోవడంతో గ్రామంలోని సుమారు 100 కుటుంబాల వారు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఉన్న బోరుబావి నుండి సరిగా నీరు రావడంతో లేదు. విధి లేక కిలో మీటరు దూరం నుండి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పాడైపోయిన మోటారును బాగు చేసి తాగునీరు అందించాలని నాడే గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేయగా, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై సెక్రటరీని అడిగితే ఎటువంటి స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నాడే ఎంపీడీవోను సంప్రదించగా తుమ్మల తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా సెక్రటరీని ఆదేశిస్తామని చెప్పారు. కాని 50 రోజులవుతున్నా నేటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం

ఫిబ్రవరి చివరి వారంలో తాగునీటి పథకం మోటారు మరమ్మతులకు గురికావడంతో తాగునీరు లేక గ్రామంలోని 100 కుటుంబాల వారు సుమారు 50 రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయించి మా గ్రామానికి తాగునీరు అందించాలి.

- వైకా నాగేశ్వరరావు, తుమ్మల గ్రామం.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

మోటారుకు మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని తుమ్మల సచివాలయం వద్దకు వెళ్లి సెక్రటరీ లేకపోవడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు తెలియజేశాం. తనకు సంబంధం లేదని సెక్రెటరీకి తెలియజేయాలని చెప్పారు. గ్రామ సమస్యపై తెలియజేస్తే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తక్షణమే సమస్యను పరిష్కారం చేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

- పట్రా రాధాకృష్ణ, తుమ్మల గ్రామం.

దూరం నుంచి నీరు తెచ్చుకుంటున్నాం

గ్రామ సచివాలయానికి వెళ్లి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిబ్బందికి దరఖాస్తు ఇవ్వగా దానిని తీసుకోవడానికి వారు నిరాకరించారు. వాటర్ ట్యాంక్ నుండి నీరు రాకపోవటం లేదు. ఉన్న ఒక్క మంచి నీటి బోరు నుండి కూడా నీరు సరిగా రావటం లేదు. దీంతో సుమారు కిలో మీటర్ దూరం నుండి తాగునీరు తెచ్చుకుంటున్నాం. అధికారులు వెంటనే స్పందించి వాటర్ ట్యాంకు మోటారుకు మరమ్మతులు చేసి తాగునీరు అందించాలి.

- కొరస సురేష్, తుమ్మల గ్రామం

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- మారేడుమిల్లి: మారేడుమిల్లి సబ్ పోస్ట్ ఆఫీసులో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం డివిజన్ పోస్టల్ అధికారి తాతు నాయుడు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల రెండో తేదీన స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సెంటర్ ప్రారంభించమని తెలిపారు. ఈ ఆధార్ సెంటర్లో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని, కావున మారేడుమిల్లి, మండలంతో పాటు వై. రామవరం ఎగువ ప్రాంత ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని ఐపివో తాతు నాయుడు కోరారు.

చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు జీవనభృతి చెల్లించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు జీవనభృతి చెల్లించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి. శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షుడు వై నూకరాజు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో 8.50 లక్షల మంది మత్స్యకారులున్నారని, వారిలో 1.50లక్షల మంది సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈనెల 15నుంచి జూన్ 14 వరకు రెండు నెలలపాటు సముద్రంలో చేపలవేటపై ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో వారి జీవనోపాధి భారమౌతుందన్నారు.

గతేడాది 1.20లక్షల మందికి నెలకు రూ.10వేలు చొప్పున ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం జీవనభృతి చెల్లించిందన్నారు. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీనిపై ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదని, మార్గదర్శకాలు జారీ చేయని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘం, రాష్ట్రప్రభుత్వాన్ని వారు కోరారు.

సామ్‌సంగ్ నుంచి ఎఐ స్మార్ట్ టివిలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఎఐ టీవీల కొత్త శకాన్ని ప్రకటించింది. గురువారం సిరిపురంలోని సామ్‌సంగ్ షోరూంలో 'అన్‌బాక్స్, డిస్కవర్'లో తన అల్ట్రా ప్రీమియం నియో క్యూ ఎల్ఇడి 8కే, నియో క్యూ ఎల్ఇడి 4కే, ఒఎల్ఇడి టీవీలను ప్రారంభించింది. ఈ సందర్భంగా సంస్థ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్ జెబి పార్క్ మాట్లాడుతూ సామ్‌సంగ్ వినియోగదారులకు అసాధారణ వీక్షణ అనుభవాలను అందించడానికి తమ ఉత్పత్తి విభాగాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఎఐ) సౌకర్యాన్ని పొందుపరిచామన్నారు. ఎఐ పరిజ్ఞానంతో యాక్సెసిబిలిటీ, సుస్థిరత, మెరుగైన భద్రతలో కొత్త ఆవిష్కరణలను అందించనున్నామన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వాల్తేర్ డివిజన్‌లోని కోరాపుట్-రాయగడలైన్‌లోని టికిరి-సింగారం-లక్ష్మీపూర్ రోడ్డు మధ్య డబుల్ లైన్‌ను ప్రారంభించేందుకు ప్రీ నాన్-ఇంటర్‌లాక్, నాన్-ఇంటర్‌లాక్ పనుల కారణంగా పలు రైళ్ల రద్దు, కొన్నింటి గమ్యస్థానాల్లో మార్పులు చేసారు.

రద్దయిన రైళ్లు

18512 విశాఖపట్నం-కోరాపుట్ బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 29,మే 3, 6 తేదీల్లోనూ, 18511 కోరాపుట్ - విశాఖపట్నం బై-వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 30, మే 4,7 తేదీల్లో రద్దు చేసారు. అదేవిధంగా 08546 విశాఖపట్నం - కోరాపుట్ ప్యాసింజర్‌ను ఏప్రిల్ 28 మే 8 వరకు, ఆలాగే 08545 కోరాపుట్ - విశాఖపట్నం ప్యాసింజర్‌ను ఏప్రిల్ 28 మే 9 వరకు రద్దు చేశారు

గమ్యస్థానల మార్పు

18107 రూర్కెలా - జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 27 నుండి మే 7 వరకు రాయగడ వద్ద షార్ట్ టర్మినేట్ చేశారు. దీంతో 18108 జగదల్‌పూర్-రూర్కెలా ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 28 నుండి మే 8 వరకు జగ్దల్‌పూర్‌కు బదులుగా రాయగడ నుండి బయలుదేరుతుంది. అదేవిధంగా 18005 హౌరా - జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26 నుండి మే 6వరకు టిట్లాగఢ్‌లో టర్మినేట్ చేశారు. దీంతో 18006 జగదల్‌పూర్ -హౌరా ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 28 నుండి మే 08 వరకు జగదల్‌పూర్‌కు బదులుగా టిట్లాగఢ్ నుండి బయలుదేరుతుంది.

రైళ్ల రీషెడ్యూలింగ్

18006 జగ్దల్‌పూర్-హౌరా సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 20న టిట్లాగఢ్‌లో ఒక గంట ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు.

చిన్నారుల ఆటవిడుపునకు వేసవి శిబిరాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: వేసవిలో చిన్నారులకు ఆటవిడుపుతోపాటు విజ్ఞానం, వినోదం అందించాలనే లక్ష్యంతో బాలల వేసవి శిబిరాలు (సమ్మర్ క్యాంప్)-2024 ఈ నెల 25 నుంచి వచ్చేనెల 10 వరకు పదిరోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖపట్నం, అల్లూరి జిల్లాలకు సంబంధించి సమ్మర్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించారు. క్యాంపు నిర్వహణకు అవసరమైన బుక్స్, స్పోర్ట్స్ కిట్స్‌ను ఆసరా ఛారిటబుల్ సొసైటీ (ఎసిఎస్), గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్‌సెక్షన్స్ (గ్లో) సంస్థలు పంపిణీ చేశాయి. విశాఖపట్నం జిల్లాలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి), అల్లూరి జిల్లాలో గిరి బాల నేస్తం (జిబిఎన్) సంస్థలు ఈ సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తారు. ఆసరా ఛారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ సి.సునీత మాట్లాడుతూ, బాలలలో క్రీడలను ప్రోత్సహించడం, పఠనాభిమానాన్ని పెంచడం ద్వారా వారిలో విలువలను పెంచడమే లక్ష్యంగా ఈ క్యాంప్‌లను నిర్వహిస్తామన్నారు. గ్లో సంస్థ ప్రతినిధి వెంకటగిరి మాట్లాడుతూ పిల్లలను వేధిస్తున్న ఒంటరితనం సమస్య నుంచి విముక్తి కల్పించి, నలుగురితో కలిసిమెలిసి ఉండడం, మంచిచెడులను తెలుసుకునే అవకాశాన్ని ఈ క్యాంపుల్లో నేర్పిస్తామన్నారు. విశాఖ జిల్లాలో 125చోట్ల, అల్లూరిలో 40చోట్ల మొత్తంగా 165 కేంద్రాలలో క్యాంపుల నిర్వహణకు అవసరమైన కిట్స్ పంపిణీ చేశామన్నారు.

విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ, బాలల సమగ్రాభివృద్ధికి ఈ రెండు సంస్థలతోపాటు మరికొంతమది వ్యక్తుల సహాయ సహకారాలు దోహదపడతాయన్నారు. పిల్లలు కలవడమే ఒక చైతన్యమైతే, వారు అలా కలుసుకొని మాట్లాడడం, ఆటలాడడం, బొమ్మలు వేయడం, పుస్తకం చదవడం, కథలు చెప్పడం, ఇంటి పనులు చేయడం, పాటలు, డాన్స్ ఇలా ఎన్నో వారికి నచ్చిన అంశాలతో క్యాంపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భీమిలి, మధురవాడ,ఆరిలోవ, మద్దిలపాలెం, జగదాంబ, కంచరపాలెం, గాజువాక, స్టీల్, గోపాలపట్నం జోన్‌ల కన్వీనర్లు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు